రాష్ట్ర బడ్జెట్‌లో గల్ఫ్ సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం మొండి చేయి చూపింది. గల్ఫ్ సంక్షేమానికి నిధులు, ప్రత్యేక ప్యాకేజీని కేటాయిస్తామని మ్యానిఫెస్టోలో చెప్పి, బడ్జెట్‌లో గుండు సున్నా ఇచ్చారు. గల్ఫ్ కార్మికులను కేసీఆర్ కంటికి రెప్పలా కాపాడుకున్నారు. రానున్న రోజుల్లో ఈ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెబుతారు.

- ఎన్నారై బీఆర్ఎస్ శాఖ అధ్యక్షులు రాధారపు సతీశ్ కుమార్

₹ ఐటీ శాఖకు కేటాయించిన నిధులు 750 కోట్లు

పదేండ్ల ప్రగతి చిత్రం..

...ఆర్థిక సర్వే లెక్కలే సాక్ష్యం!

2023-24లో రాష్ట్ర తలసరి రూ.3,47,299

దేశ తలసరి కంటే మన తలసరి 90% ఎక్కువ



జిల్లాలు: 33, మండలాలు: 620

గ్రామపంచాయతీలు: 12,769

2014-15లో తెలంగాణ జీఎస్డీపీ (ప్రస్తుత ధరల్లో) 5.05 లక్షల కోట్లు

2023-24లో జీఎస్డీపీ 14.64 లక్షల కోట్లు

జీఎస్డీపీ వృద్ధిరేటు 11.9% (జాతీయ వృద్ధి రేటు కంటే 2.8%ఎక్కువ)

తెలంగాణ జీఎస్డీపీలో 65.7% వాటా సర్వీసు సెక్టారుదే.



తలసరి, జీఎస్డీపీలో రాకెట్ వేగంతో తెలంగాణ

దేశ తలసరిని మించిపోయిన 30 జిల్లాల తలసరి

పదేండ్లలో 9.59 లక్షల కోట్లు పెరిగిన జీఎస్డీపీ

సామాజిక, ఆర్థిక నివేదిక - 2024లో సుస్పష్టం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): ఏ దేశమైనా, రాష్ట్రమైనా అభివృద్ధి చెందిందని చెప్పేందుకు అక్కడి పౌరుల తలసరి ఆదాయాన్ని, ఉత్పాదకతను ప్రామాణికంగా తీసుకొంటారు. కేసీఆర్ ప్రభుత్వహయాంలో గడిచిన పదేండ్లలో తెలంగాణ ఈ రెండు అంశాల్లో రాకెట్ వేగంతో దూసుకుపోయింది. ఒక్క తలసరి, జీఎస్డీపీలోనే కాదు.. సాగు, పారిశ్రామికీకరణ, సేవలు, సంక్షేమం.. ఇలా అన్ని రంగాల్లోనూ పురోగతి సాధించింది. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన తెలంగాణ సామాజిక, ఆర్థిక నివేదిక (సోషియో ఎకనామిక్ ఔట్‌లుక్) -2024 వివిధ రంగాల్లో తెలంగాణ సాగించిన ప్రగతిని, తాజా పరిస్థితులను వెల్లడించింది.

తలసరిలో మేటి.. మరెవరు సాటి

తలసరి ఆదాయాన్ని, దాని వృద్ధిరేటును ఆ దేశ లేదా రాష్ట్ర అభివృద్ధి వేగానికి నిదర్శనంగా భావిస్తారు. ఈ రెండు అంశాల్లో జాతీయ తలసరి ఆదాయంతో పోల్చితే.. తెలంగాణ ఎంతో ఎత్తులో ఉన్నది. కేసీఆర్‌హయాంలో గడిచిన పదేండ్లలో చేపట్టిన సంస్కరణలే దీనికి కారణంగా చెప్పొచ్చు. తెలంగాణ ఏర్పడినప్పుడు 2014-15లో ప్రస్తుత ధరల వద్ద రాష్ట్ర తలసరి ఆదాయం రూ.1,24,105గా నమోదైంది. అప్పుడు జాతీయ తలసరి ఆదాయం రూ.86,647గా ఉండేది. ఈ లెక్కన చూసుకొంటే జాతీయ తలసరి ఆదాయం కన్నా తెలంగాణ ఆదాయం 43 శాతం ఎక్కువగా ఉన్నది. 2022-23 సంవత్సరానికి వచ్చేసరికి ఈ అంతరం మరింతగా పెరిగిపోయింది. 2023-24నాటికి తెలంగాణ తలసరి ఆదాయం రూ.3,47,299కు చేరుకున్నది. జాతీయ తలసరి ఆదాయం మాత్రం రూ.1,83,236 కే పరిమితం అయ్యింది. అంటే రాష్ట్ర తలసరి ఆదాయం..దేశ తలసరి ఆదాయం కంటే 89.53 శాతం ఎక్కువగా నమోదైంది. అంతేకాదు.. దేశ తలసరి ఆదాయం కంటే, రాష్ట్రంలోని 30 జిల్లాల తలసరి ఆదాయం ఎక్కువగా ఉండటం గమనార్హం. ఈ మేరకు సామాజిక ఆర్థిక సర్వే 2024 వెల్లడించింది.

జీఎస్డీపీలో దూకుడు

తెలంగాణ ఆవిర్భావం జరిగినప్పుడు 2014-15లో ప్రస్తుత ధరలను బట్టి రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్డీపీ) రూ. 5.05 లక్షల కోట్లుగా నమోదైంది. అయితే, 2023-24నాటికి తెలంగాణ జీఎస్డీపీ రూ. 14.64 లక్షల కోట్లకు చేరింది. పదేండ్ల వ్యవధిలో తెలంగాణ జీఎస్డీపీ రూ. 9.59 లక్షల కోట్ల మేర పెరిగింది. జీఎస్డీపీలో సేవారంగం 65.7 శాతంతో అగ్రస్థానంలో కొనసాగుతున్నది. మైనింగ్, తయారీ రంగం 18.5%, వ్యవసాయం, అనుబంధ రంగాలు 15.8% వాటాను కలిగి ఉన్నాయి. రాష్ట్రంలోని మొత్తం శ్రామిక శక్తిలో 47.34% మంది వ్యవసాయం, దాని అనుబంధ రంగాలమీదనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. 2022-23లో వ్యవసాయ ఉత్పత్తులు మొత్తం 414 లక్షల మెట్రిక్ టన్నులుగా రికార్డయ్యింది. వరి, పత్తి, మొక్కజొన్న ఇందులో ప్రధాన పంటగా ఉన్నది. ఇక, రాష్ట్రం మొత్తం విస్తీర్ణంలో 24% మేర అటవీ ప్రాంతమే ఉన్నది. జాతీయ సగటు 21.34 శాతంతో పోలిస్తే, ఇది ఎక్కువ. ఈ మేరకు సామాజిక ఆర్థిక సర్వే 2024 వివరించింది.

పదేండ్ల ప్రగతి ఫలమిది..

ఎవుసం పండుగ

- మొత్తం శ్రామిక శక్తిలో 47.34 శాతం మంది వ్యవసాయం, దాని అనుబంధ రంగాలమీదనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.
- రాష్ట్ర జీఎస్‌వీఏలో వ్యవసాయరంగం వాటా రూ. 2,11,422 కోట్లు.
- 2022-23తో పోలిస్తే ఇది 4 శాతం ఎక్కువ
- 2022-23లో వ్యవసాయ ఉత్పత్తులు మొత్తం 414 లక్షల మెట్రిక్ టన్నులుగా రికార్డయ్యింది. వరి, పత్తి, మొక్కజొన్న ఇందులో ప్రధాన పంటగా ఉన్నది.



2014-15లో తలసరి ఆదాయం రూ. 1,24,105

2023-24లో తలసరి ఆదాయం రూ. 3,47,299

జీవ వైవిధ్యానికి పెన్నిది

- మొక్క జాతులు – 2,939
- పక్షి జాతులు – 365
- క్షీరద జాతులు – 103
- సరీసృప జాతులు – 28



పచ్చని తెలంగాణ

- మొత్తం విస్తీర్ణంలో 24 శాతం మేర అటవీప్రాంతమే. దీని విస్తీర్ణం 26,969 చదరపు కిలోమీటర్లు.
- జాతీయ సగటు 21.34 శాతంతో పోలిస్తే, ఇది ఎక్కువ

సంక్షేమం

- 2023-24లో ఎస్సీల సంక్షేమానికి రూ.14,648.94 కోట్లు, ఎస్టీల సంక్షేమానికి రూ. 10,398.96 కోట్లు ఖర్చు.
- 2023-24లో కళ్యాణలక్ష్మి పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ (షాదీ ముబారక్) కుటుంబాలకు రూ.1,664.82 కోట్ల సాయం.
- 2023-24లో ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్స్ కోసం రూ. 505.26 కోట్లు, పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్స్ కోసం రూ. 1,42,785 కోట్లు ఖర్చు.

ప్రగతిని కూడా దాచాలని..

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క తలసరి, జీఎస్డీపీలో వృద్ధే కాదు... సాగు విస్తీర్ణం కూడా ఎంతో పెరిగింది. ధాన్యం దిగుబడి కొత్త రికార్డులను నమోదు చేసింది. అంతేకాదు.. విద్యుత్తు సంస్థల బలోపేతం, స్థాపిత విద్యుత్తు సామర్థ్యంలో పెరుగుదల, విద్య-వైద్య రంగాల అభివృద్ధి, రోడ్లు, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం, వైద్య కళాశాలల ఏర్పాటు, మౌలిక వసతుల కల్పన, అన్నివర్గాల అభ్యున్నతికి 400కు పైగా చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు ఇలా చెప్పుకొంటూ పోతే ఆ జాబితా ఎంతో పెద్దది. అయితే, ఆర్థిక సర్వేలో ఆ అంశాలను, లెక్కలను ప్రస్తావించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చాలా ప్రయాస పడింది. గతంలో జరిగిన ప్రగతిని విస్మరించి.. తాము చేపట్టబోయే పనుల గురించి మాత్రమే ఏకరువు పెట్టింది. అంతేకాదు నిజాలను కూడా దాచిపెట్టింది. దాదాపు ప్రతీ రంగంలో పదేండ్లలో తెలంగాణ సాగించిన ప్రగతిని విస్మరించడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నించింది. ఆర్థిక సర్వేలో అడుగడుగునా ఈ విషయం ప్రస్ఫుటమైంది.

తగ్గిన మూలధన వ్యయం

- రెవెన్యూ వ్యయంలో ఏడోవంతు మాత్రమే
- నిరుటి కన్నా రూ.10 వేల కోట్లు తగ్గింపు
- ఈ నిధులతో అభివృద్ధి, ఆస్తుల కల్పన ఎలా?

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది మూలధన వ్యయాన్ని భారీగా తగ్గించింది. ఇందుకు బడ్జెట్‌లో రూ.33,486 కోట్లను కేటాయించింది. ఈ నిధులతో రాష్ట్ర అభివృద్ధి, ఆస్తుల కల్పన ఎలా సాధ్యమన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇదే సమయంలో రెవెన్యూ వ్యయం రూ.2,21,242 కోట్లుగా చూపింది. అంటే నిర్వహణకు చేస్తున్న వ్యయంతో పోల్చితే అభివృద్ధి కోసం చేస్తున్న ఖర్చు కేవలం ఏడో వంతు మాత్రమే. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లపాటు మూల ధన వ్యయంపై ప్రత్యేక దృష్టిసారించింది. ఏటా కేటాయింపులను పెంచింది. పైగా.. అదనంగా ఖర్చుచేసింది కూడా. ఉదాహరణకు 2023-24 ఆర్థిక సంవత్సరంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మూల ధన వ్యయానికి రూ.37,524 కోట్లు కేటాయించింది. అంచనాలకు మించి రూ.44,252 కోట్లు ఖర్చు చేసింది. రూ.6,728 కోట్ల మేర అదనపు నిధులను మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆస్తుల కల్పన కోసం వెచ్చించింది. కానీ ఈసారి రాష్ట్ర ప్రభుత్వ కేటాయింపులు నిరుటి వ్యయంతో పోల్చితే సుమారు రూ.10,766 కోట్లు తక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మౌలిక సదుపాయాల అభివృద్ధి అనుకున్న స్థాయిలో జరుగక.. కుంటుపడుతుందన్న విమర్శలు మొదలయ్యాయి.

రెవెన్యూ రాబడి

రాష్ట్ర పన్నులు	1,38,181.26 కోట్లు
కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా	26,216.38 కోట్లు
ఇతర పన్ను ఆదాయం	56,131.80 కోట్లు
మిత్తీల ద్వారా ఆదాయం	712.79 కోట్లు
రుణాలు	62,112.48 కోట్లు
లోన్ రికవరీలు	3,560 కోట్లు
పబ్లిక్ అకౌంట్ (నెట్)	4,000 కోట్లు
మొత్తం	2,90,914.71 కోట్లు

రెవెన్యూ వ్యయం

నిర్వహణ వ్యయం	2,20,944.81 కోట్లు
మూలధన వ్యయం	33,486.50 కోట్లు
ప్రజా రుణాల చెల్లింపు	17,101.37 కోట్లు
లోన్లు, అడ్వాన్సుల చెల్లింపు	19,626.32 కోట్లు
మొత్తం	2,91,159 కోట్లు
లోటు	244.29 కోట్లు

నిరుద్యోగ భృతి అమలు హుళక్కే!

బడ్జెట్‌లో ఒక్క రూపాయీ కేటాయించని సర్కారు

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని నిరుద్యోగులకు కాంగ్రెస్ సర్కారు దగా చేసింది. గత ఎన్నికల ముందు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను బుట్టదాఖలు చేసింది. కాంగ్రెస్ ఎన్నికల హామీలైన ఏటా 2 లక్షల ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలండర్ ప్రకటన అమలు కోసం బడ్జెట్‌లో ఒక్క రూపాయీ ప్రతిపాదించలేదు. దీంతో అసలు రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తారా? లేదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిరుద్యోగులకు ప్రతినెలా రూ.4,000 నిరుద్యోగ భృతి హామీనీ కాంగ్రెస్ ప్రభుత్వం అటకెక్కించింది. బడ్జెట్‌లో దాని ప్రస్తావనే లేకుండాపోయింది. గతంలో కేసీఆర్ హయాంలో నిరుద్యోగుల కోసం బడ్జెట్‌లో రూ.1000 కోట్లు కేటాయించారు. గ్రూప్-1, 2, 3, 4 పంటి నోటిఫికేషన్లతోపాటు టీచర్, పోలీసు, గురుకుల టీచర్ పోస్టులు, స్టాఫ్‌నర్స్ తదితర వేలాది ఉద్యోగాల భర్తీకి ఆనాటి ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం పక్షపాత ధోరణి అవలంబిస్తున్నదని నిరుద్యోగులు రగిలిపోతున్నారు.

రైతు పథకాలకు అరకొర నిధులు!

- తగినన్ని నిధులు కేటాయించలేదు
- రైతు పథకాల్లో కోతలని సంకేతం

హైదరాబాద్, జూలై 25(నమస్తే తెలంగాణ): బడ్జెట్‌లో వ్యవసాయానికి రూ.72 వేల కోట్లతో భారీ మొత్తంలో నిధులు కేటాయించామని ప్రభుత్వం చెప్తున్నప్పటికీ, కాంగ్రెస్ హామీ ఇచ్చిన రైతు పథకాల అమలుకు ఈ నిధులు ఏమాత్రం సరిపోవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి పథకానికీ అవసరమైన నిధుల్లో ప్రభుత్వం కోతలు పెట్టిందని వ్యవసాయ శాఖ నిపుణులు విశ్లేషిస్తున్నారు. తద్వారా ఆయా పథకాల్లో కోతలు ఖాయమనే అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తున్నారు. లబ్ధిదారుల సంఖ్యలో అడ్డంగా కోతలు పెడితేనే ప్రస్తుతం కేటాయించిన నిధులు సరిపోతాయని చెప్తున్నారు. లేనిపక్షంలో ఈ నిధులు ఏ మూలకూ సరిపోవని అంటున్నారు.

రుణమాఫీ: బడ్జెట్‌లో ప్రభుత్వం రుణమాఫీకి రూ.26 వేల కోట్లు కేటాయించింది. ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ కోసం రూ.31 వేల కోట్లు అవసరమవుతాయని గతంలో ప్రభుత్వమే తెలిపింది. కానీ, బడ్జెట్ కేటాయింపులు అందుకు తగ్గట్టుగా లేవు. ప్రభుత్వ అంచనాకీ, కేటాయింపుకీ మధ్య రూ.5 వేల కోట్ల లోటు కనిపిస్తున్నది. అంటే ఈ మేరకు రుణమాఫీలో లబ్ధిదారుల సంఖ్యలో కోత పెడతారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రైతుభరోసా: ప్రభుత్వం రైతుభరోసా(రైతు బంధు)కు రూ.15,075 కోట్లు కేటాయించింది. వాస్తవానికి కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ప్రతి రైతుకు ఎకరానికి రూ.15 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని హామీ ఇచ్చింది. రాష్ట్రంలో 69 లక్షల మంది రైతులకు 153 లక్షల ఎకరాల భూమి ఉన్నది. వీటికి యథాతథగా ఇచ్చేందుకు కనీసం రూ.23 వేల కోట్ల నిధులు అవసరం. కానీ ప్రభుత్వం రూ.15 వేల కోట్లు మాత్రమే కేటాయించింది. అవసరానికన్నా రూ.8 వేల కోట్లు తక్కువగా కేటాయించింది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేల చొప్పున సాయం అందించేందుకు రూ.15 వేల కోట్లు కేటాయించింది. ఇప్పుడు ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని చెప్పి, అంతే నిధులు కేటాయిస్తే ఏ విధంగా ఈ పథకాన్ని అమలుచేస్తారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఆ మేరకు కొంతమంది రైతులకు రైతుభరోసాలో ఎగనామం పెడతారని స్పష్టమవుతున్నది.

వ్యవసాయ కూలీలకు...

ఈ ఏడాది నుంచి వ్యవసాయ కూలీలకు కూడా ఏడాదికి రూ.12 వేల చొప్పున భరోసా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇందు కోసం రూ.1,200 కోట్లు కేటాయించింది. రాష్ట్రంలో ఉపాధి హామీ కార్డులు సుమారు 50 లక్షలు ఉన్నాయి. ఈవిధంగా కార్డుకు ఒకరికి భరోసా ఇచ్చినా రూ.6 వేల కోట్లు అవసరం.. కానీ, ప్రభుత్వం రూ.1,200 కోట్లు మాత్రమే కేటాయించింది. దీంతో వ్యవసాయ కూలీలు అందరికీ భరోసా ఇచ్చే అవకాశం లేదని స్పష్టమవుతున్నది.

పంటలకు బోనస్

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వరి ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చింది. బడ్జెట్‌లో రూ.1,800 కోట్లు కేటాయించింది. ఈ నిధులు ఏ మాత్రం సరిపోవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఏడాదికి రెండు సీజన్లు కలిపి సుమారు 50-60 లక్షల టన్నుల సన్నాలు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన రూ.2,500 నుంచి రూ.3వేల కోట్లు అవసరం. అయితే ప్రభుత్వం రూ.1800 కోట్లతో సరిపెట్టింది. మిగిలిన పంటలకు కూడా బోనస్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం.. ఈ బడ్జెట్‌లో ఒక్క వరికి మాత్రమే కేటాయించి చేతులు దులుపుకున్నది.

చేనేత, వస్త్రశాఖకు 355కోట్లు

బడ్జెట్‌లో లేని బతుకమ్మ చీరల పథకం

హైదరాబాద్, జూలై 25(నమస్తే తెలంగాణ): చేనేత, వస్త్ర శాఖకు ప్రభుత్వం రూ.355కోట్లు కేటాయించింది. విద్యార్థుల యూనిఫామ్స్, దవాఖానల్లో ఉపయోగించే బెడ్‌షీట్లు వంటివి చేనేత సహకార సంఘాల ద్వారా సేకరిస్తామని బడ్జెట్‌లో ప్రకటించింది. ఇందులో బతుకమ్మ చీరల ప్రస్తావన లేకపోవడం విశేషం. బడ్జెట్‌లో చేనేత కార్మికులకు ఆర్థిక సహకారం(ఫైనాన్షియల్ అసిస్టెన్స్) కింద రూ.153కోట్లు, కార్మికుల బీమాకు రూ.15కోట్లు, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ ప్రమోషన్‌కు రూ.187కోట్లు కలిపి మొత్తం రూ.355కోట్లు కేటాయించారు. అలాగే, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ(ఐఐహెచ్‌టీ) ఏర్పాటుకు కేంద్రం అంగీకరించిందని, త్వరలో ఏర్పాటు చేస్తామని బడ్జెట్ ప్రసంగంలో మంత్రి ప్రకటించారు. సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ టెక్నికల్ టెక్స్‌టైల్స్ ఏర్పాటుకు కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలిపారు. కాగా, గత ప్రభుత్వం ఏటా చేనేత కార్మికులను ఆదుకునేందుకు రూ. 500కోట్లు కేటాయించేది. ఇందులో బతుకమ్మ చీరలకే రూ. 300నుంచి రూ.350కోట్లు చెల్లించేవారు. 35వేలమంది చేనేత కార్మికులకు సంవత్సరమంతా చేతినిండా పని దొరికేది. కాగా, ప్రభుత్వం ఈసారి బడ్జెట్‌లో బతుకమ్మ చీరల పథకం ప్రస్తావన కూడా తేలేదు.

హోంశాఖకు 35 కోట్లు కోత

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణను కాంగ్రెస్ ప్రభుత్వం లైట్ తీసుకుంటుంది. అంతరంగీక రక్షణకు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో కేవలం రూ.3,349 కోట్లు మాత్రమే కేటాయించి, ఇప్పుడు పూర్తి స్థాయి బడ్జెట్‌లో గతంకంటే రూ.35 కోట్లు తక్కువగానే కేటాయించింది. కేసీఆర్ గత బడ్జెట్‌లో రూ.9,599 కోట్ల నిధులను కేటాయించారు. అంతకుముందు బడ్జెట్‌లో రూ.9,315.47 కోట్లు కేటాయించారు. కాగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రూ.9,564 కోట్లను మాత్రమే కేటాయించింది. తమకు బడ్జెట్‌లో తక్కువ కేటాయించడంపై పోలీసు వర్గాలు అసహనం వ్యక్తం చేస్తున్నాయి.

బ్రాహ్మణ సంక్షేమానికి రూ.50 కోట్లు

దేవాదాయ శాఖకు 189 కోట్లు

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): బ్రాహ్మణ సంక్షేమానికి ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.50 కోట్లు, దేవాదాయ శాఖకు రూ.189 కోట్లు కేటాయించారు. బ్రాహ్మణ స్వయం ఉపాధి పథకం (బెస్ట్), వివేకానంద విదేశీ విద్యాపథకం కోసం 800 మందిని ఎంపికచేశారు. ఈ పథకాల కోసం రూ.100 కోట్లు అవసరమవుతాయని బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ప్రభుత్వానికి ప్రతిపాదన పంపింది. విదేశీ విద్యా పథకం కింద ఎంపికైన 300 మంది అప్పులుచేసి విదేశాల్లో విద్యను అభ్యసిస్తుండగా, స్కాలర్‌షిప్ అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆలయాల అభివృద్ధికి రూ.47 కోట్లు, కామన్‌గుడ్ ఫండ్ కింద 13.33 కోట్లు, అర్చకులు, ఆలయ ఉద్యోగుల వేతనాలకు రూ.109.52, బోనాలకు 20 కోట్లు కేటాయించారు. ప్రధాన ఆలయాల అభివృద్ధి ఇప్పట్లో సాకారమయ్యేలా కనిపించడంలేదు.

వ్యవసాయం కలగాపులగం

అత్యధికంగా రూ.72,659 కోట్లు

- విద్యుత్తు సబ్సిడీ, నీటిపారుదల ఖర్చులూ ఇందులోనే
- రుణమాఫీకి 26 వేల కోట్లు
- రైతుభరోసాకు 15,075 కోట్లు.. బోనస్‌కు 1800 కోట్లు
- రైతుకూలీలకు 1200 కోట్లు
- వ్యవసాయ లెక్కగంగరగోళంగా ఉందంటున్న నిపుణులు

హైదరాబాద్, జూలై 25(నమస్తే తెలంగాణ): బడ్జెట్‌లో వ్యవసాయానికి అత్యధిక నిధులు కేటాయించినట్టు ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క చెప్పారు. వ్యవసాయానికి మొత్తంరూ.72,659 వేల కోట్లు కేటాయించారు. గత ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ, అనుబంధరంగాలకు కలిపి మొత్తం రూ.32,019 కోట్ల బడ్జెట్‌ను గత ప్రభుత్వం కేటాయించింది. ఈ బడ్జెట్‌లో అనుబంధరంగాలైన ఉద్యానశాఖకు రూ.737 కోట్లు, పౌరసరఫరాల సంస్థకు రూ.3,836 కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ.1,980 కోట్లు కేటాయించింది. ప్రభుత్వం అమలుచేస్తున్న, చేయబోయే పలు పథకాలకు నిధులు కేటాయించింది. ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఈ ఏడాది నుంచి వ్యవసాయ కూలీలకు కూడా రైతుభరోసాను అమలు చేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకోసం బడ్జెట్‌లో రూ.1,200 కోట్లను కేటాయించింది. దీంతోపాటు రైతుభరోసా కోసం రూ.15,075 కోట్లు కేటాయించింది. రుణమాఫీ కోసం రూ.26 వేల కోట్లు, ధాన్యం బోనస్‌కు రూ.1,800 కోట్లు కేటాయించింది. వీటితోపాటు రైతులకు సబ్సిడీ విత్తనాలు అందించేందుకు రూ.106 కోట్లు, పంటల బీమా కోసం 1,300 కోట్లు, రైతు బీమా కోసం 1,589 కోట్లు కేటాయించింది.

విద్యుత్తు సబ్సిడీ, నీళ్ల లెక్కలూ ఇందులోనే..

ప్రభుత్వం వ్యవసాయ శాఖ బడ్జెట్‌ను ఎక్కువగా చూపేందుకు తాపత్రయ పడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. బడ్జెట్ కేటాయింపుల్లోని లెక్కలను వ్యవసాయ, ఆర్థికరంగ నిపుణులు ఇందుకు ఉదాహరణగా చూపుతున్నారు. వ్యవసాయానికి అవసరమయ్యే విద్యుత్తు సబ్సిడీ, నీటిపారుదల ఖర్చును కూడా ప్రభుత్వం వ్యవసాయ పద్దులోనే చూపడం గమనార్హం. విద్యుత్తు సబ్సిడీ కింద రూ.11,500 కోట్లు, నీటిపారుదల ఖర్చు కింద రూ.10,829 కోట్లు చూపించింది. ఈ రెండు పథకాలు కలిపి రూ.22,329 కోట్లు చూపించింది. ఈ రెండింటిని తీసేస్తే వ్యవసాయ శాఖ బడ్జెట్ రూ.72,659 కోట్ల నుంచి రూ.50,330 కోట్లుగా ఉంటుంది. రుణమాఫీకి కేటాయించిన రూ.26వేల కోట్లనూ మినహాయిస్తే వ్యవసాయ శాఖ బడ్జెట్ రూ.24 వేల కోట్లేనని నిపుణులు లెక్కవేస్తున్నారు. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం వ్యవసాయరంగానికి రూ.26,831 కోట్లు కేటాయించింది. ఈ లెక్కన ప్రస్తుతం ప్రభుత్వం గతంతో పోల్చితే రూ.2,831 కోట్లు తక్కువగానే కేటాయించిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

BHASKAR ENGINEERING COLLEGE
ECET Code : BSKR
(Approved by AICTE, Affiliated to JNTUH, Hyderabad)
Bhaskar Nagar, Yenkapally (V), Moinabad (M), R.R. District, Hyd - 075.
Ph:8008096774 / 9704095666 Website: www.bec.edu.in
SPOT ADMISSIONS TG ECET-2024-25

COURSES :	CSE	CSM	AID	IT	ECE

Eligible Candidates can attend for the Spot admissions with All Original Certificates along with 2 Set of photo copies in the college premises on 30-07-2024. Admission will be made as per guidelines given by the Convener, TGECET 2024.
Hostel Facility available at campus for both Boys & Girls
Buses from all parts of twin cities.
Sd/- PRINCIPAL

SBI
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సెంట్రల్ ఆక్విజిషన్ & ప్రమోషన్ డిపార్ట్‌మెంట్
కార్పొరేట్ సెంటర్, ముంబయి
ఇమెయిల్ ఐడి:: crpd@sbi.co.in
అప్లై చేయడానికి QR కోడ్‌ను స్కాన్ చేయండి
కాంట్రాక్టు ప్రాతిపదిక న స్పెషలిస్టు అధికారుల నియామకం
కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింద స్పెషలిస్ట్ గ్రేడ్ పోస్టుల కోసం భారతీయ పౌరుల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడ్డాయి.

క్రమ సంఖ్య	ప్రకటన నం.	పోస్ట్ పేరు	ఖాళీ
1	CRPD/SCO/2024-25/12	డిపాజిట్స్ బ్యాంకింగ్ అడ్వైజర్ - ఆర్మీ	1
2	CRPD/SCO/2024-25/13	ఎకనామిస్ట్	2

దరఖాస్తు చేయడానికి మరియు ఫీజు చెల్లించడానికి ముందు అర్హత మరియు ఇతర వివరాలను నిర్ధారించడానికి బ్యాంక్ కెరీర్ వెబ్‌సైట్‌లో వివరణాత్మక ప్రకటనలను చూడండి. దరఖాస్తు చేయడానికి, మా కెరీర్ పేజీని (https://bank.sbi/careers/current-openings) చూడండి.
• ఆన్ లైన్ లో దరఖాస్తు చేయుటకు మరియు ఫీజు చెల్లింపు తేదీ : 17.07.2024 నుండి 06.08.2024 వరకు.
స్థలం: ముంబై
తేదీ: 17.07.2024
మహానిర్వహణాధికారి (ఆర్‌పీ & పీఎం)